# రవి కమలం



— బొల్లిముంత నాగేశ్వరరావు

వెంకట్రామయ్య అన్నాడు:

"ఉత్తరం వచ్చిందమ్మా, సమాధానం వ్రాయి."

బరువుగా ఇచ్చాడు!

ఆమె తీసుకుంది. నిశ్శబ్దంగా చించింది.

ఆమె కళ్లనుండి బాష్పాలు రాలాయి!

మెల్లిగా బయటకు తీసింది. చదవటం ప్రారంభించింది.

"ప్రియమైన వసూ!

నీవు వ్రాసిన ఉత్తరం అందింది. నీకీ మధ్య జ్వరం వచ్చిందనీ, అప్పటినుండీ ఒక విధంగా ఉంటూందనీ వ్రాశావు. అందుకు నేను విచారిస్తున్నాను.

దస్తూరీ కూడా మారింది సుమా!

మానవ ప్రకృతిలో మార్పు సహజం.

వసూ!

కొన్నివేల మైళ్ల నుండి నిన్ను చూడలేకపోయినా నీవు వ్రాసిన ప్రతి అక్షరంలోను నిన్ను స్పష్టంగా చూడగలుగుతున్నాను. నీ మనోహర రూపాన్ని మనసులో చిత్రించుకుంటూ నేను క్షణమొక మహాయుగంలా

[redacted]

రవి కిరణం పడి గిలిగింతలు పెట్టినపుడే కమలం పులకరించి విచ్చుకుంటుంది జీవితంలోని వెచ్చదనాన్ని అనుభవించాలనే తపన తీరుతుంది. మనిషీ అంతే. తాను ఒకరికోసం పొందే ఆరాటం, తనకోసం మరొకరు పొందే ఆరాటాన్ని గుర్తించి, దాన్ని ఆరాధనగా మార్చుకుంటే సుఖించడం జరుగుతుంది. వలపు విలువ పెరుగుతుంది.

[redacted]

గడిపేస్తున్నాను. నా బాధ్యతను గుర్తుచేస్తూ ఉత్తరాలు మరీ మరీ వ్రాస్తున్నావు!

నీ విక్కడ లేవనుకున్నావా, వసూ!

నువ్వెప్పుడూ నా దగ్గిరే ఉన్నావు! నా మనసులో, హృదయంలో, మనిషిలో—కాదు కాదు—ప్రతి కణంలో, అణువులో నీవు నిత్యం గుర్తుచేస్తూనే ఉన్నావు. దానిని మరలా ఉత్తరాల్లో వ్రాయవద్దు.

ఈ చదువు నాకోసం కాదు...కాదు నీకోసం, నీ మనోహర రూపంకోసం, ఆ మనోహర రూపంలో అతి మనోహరంగా మెరిసే నీ మనసుకోసం, అందులో అత్యున్నతస్థానాన్ని పొందిన నాకోసం చదువుతున్నాను.

నేను లండనులో లేను. నీ గుండెల్లో ఉన్నాను.

ఉత్తరాలు వ్రాయటం తగ్గిస్తున్నావు. అలాగే అయితే పాత ఉత్తరాలు పదే పదే చదువుకోవలసి వస్తుంది.

నీ ఉత్తరాలు విరహాన్ని రేపి, ప్రేమకంటె ఒక్కొక్కసారి బాగా కసిగా నన్ను తయారు చేస్తున్నాయి!

మరలా ఉత్తరం వ్రాయి.

అన్నట్టు అందరినీ అడిగానని చెప్పు.

మరదలుపిల్లని మరీ మరీ అడిగానని చెప్పు.

మరి శ్రీమతిగారికి నా . . .

ఇట్లు,

—నీ రవి."

ఆమె కళ్లనుండి రాలిన బాష్పాలు ఉత్తరాన్ని తడిపివేశాయి. ఆమె ఆ ఉత్తరాన్ని ముఖానికి అడ్డంగా పెట్టుకుంది. ఎదురుగా ఉన్న తలిదండ్రులకు ఆమె ముఖం కనిపించలేదు.

● ● ●

"ప్రియమైన భర్తగారికి"—

లండనులో ఉత్తరం చదివి రవి తుళ్లిపడ్డాడు.

ఒకసారి శ్రీవారికి, మరోసారి భర్తగారికి, మరోసారి మరోవిధంగా అంటుంది వసు.

"ఉత్తరం చదివాను. విషయాలు తెలిశాయి."

రవి నవ్వుకున్నాడు.

"బాగా చదువుతున్నారు కదూ?"

పెద్దగా నవ్వుకున్నాడు రవి.

"ఇక్కడ మరదలు అంతా బాగానే ఉన్నారు." ఈసారి రవికి మరీ నవ్వు వచ్చింది. ఎప్పుడు వ్రాసినా చెల్లి కమల అనేది. ఇపుడు మరదలు అనటంలో రవికి కొంత తత్తరపాటు కలిగింది. అయినా అందులో పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదు కాబట్టి రవి ముందుకు చదువుకుపోయాడు.

"చీకటిలో ఉన్నాను నేను. నా రవి భారతావని మీద ఉదయించిననాడు నాకు నిండువెండుగ.

నేనొక కమలాన్ని! రవికిరణంకోసం ఎదురుచూసే కమలాన్ని. విచ్చుకొని జీవితంలోని వెచ్చదనం చూడాలనే కమలాన్ని!"

'కవిత్వం వ్రాస్తుంది వసు!' నవ్వుకున్నాడు రవి! మరలా చదువుకుపోయాడు.

"ఇక్కడ చీకటిలో ఏం జరుగుతున్నదీ మీకు తెలియదు! ఔను! మీకేం తెలుసు! మీ చుట్టూ ఉండేది వెలుగే కాబట్టి మీకేం పట్టదు. మరి ట్రెయినింగ్ పూర్తి కాగానే వస్తారు కదూ?

ఇట్లు,

—మీ వసు."

# పరిధి(లో)...!

లోకమే పరమ పద సోపాన పఠం
అందు నా జీవితం దారం తెగిన గాలిపటం—

ఎదుటివాని మెప్పుకై
చెపుతాడు నీతులు
కుప్పిగంతులతో
గెంతుతాయి కోతులు . . .

భార్యా పిల్లల్ని పోషించలేక
నస్తులతో కాలం గడిపే మారకం ( కానక )
భుక్తి కానక శక్తి లేక
రైలు పట్టాలు కౌగలించుకున్న దృశ్యం
'హృదయ విదారకం' —

లోకమే పరమ పద సోపాన పఠం
అందు నా జీవితం దారం తెగిన గాలిపటం . . .

చాలీచాలని జీతంతో బరువు మోస్తున్న
గుమాస్తా
కంట్రాక్టరు అధిక లాభాలతో చూస్తున్న
రాస్తా
ఎప్పటికీ దారి కానవు ( ప్రస్తుతంలో )
రుధిర రణాలు శస్త్ర చికిత్సకుగాని మానవు!

లోక ప్రవంతిలో
'కాకా'తో బ్రతుకు వెలమార్చు 'జీవి'
ప్రస్తుత పరిస్థితుల్లో తాత్కాలికంగా
వృద్ధిచెందు అతని చేష్టల తెలివి —

లోకమే పరమ పద సోపాన పఠం
అందు నా జీవితం దారం తెగిన గాలిపటం....

—కొప్పర్తి రామారావు



మనిషి అన్నవాడు జీవితంలో ముఖ్యంగా సాధించవలసినవి మూడని ఒక ప్రముఖుడు అన్నాడు. అవి మొక్కలు నాటడం, గ్రంథాలు రచించడం, పిల్లల్ని కనడం.

"మనుషులు మొదటి రెండూ అధికంగా సాధిస్తే బాగుండును" అని వాపోయాడు ఆయన.

ఉత్తరం చాలా క్లుప్తంగా ముగించినందుకు కోపం వచ్చింది రవికి. ఎప్పుడు వ్రాసినా రెండు అరఠావు పేజీలకు తక్కువ వ్రాసేది కాదు. అనేక విషయాలు వ్రాసేది. అమాయికంగా వ్రాసేది.

క్లుప్తంగా కవిత్వం నేర్చుకుం దీమధ్య!

వినుక్కున్నాడు రవి!

● ● ●

తనివితీరని ఆత్మ తన బ్రతికి ఉన్న ప్రియతమ చుట్టూ బలీయమైన ప్రేమశక్తిని దాటలేక తిరిగినట్లు బలీయమైన ఆకర్షణ శక్తిని దాటలేని వసుంధర రవిచుట్టూ సగం ప్రదక్షిణ చేసింది!

కాలం అర్ధ సంవత్సరం గడిచింది.

● ● ●

టెలిగ్రామ్ అందుకున్న ఆమె తత్తరపడింది.

రవి వస్తున్నాడు!

ఆహ్వానించటానికి అమ్మ, నాన్న లేరు. అంతా తిరుపతి పోయారు. తానీ పరిస్థితిలో ఏం చేయగలదు! స్టేషనుకు పోవటం ఎలా? ఆయన్ని ఆహ్వానించటం ఎలా? వీరంతా ఎక్కడికి వెళ్లారూ అంటే ఏమని చెప్పటం?

ముచ్చెమటలు పట్టేనయ్ ఆమెకు! మంచంమీద అలాగే కూలిపోయింది. భారతావని మీద రవి అస్తమించాడు! లండను రవి ఉదయించాడు!

ఆమెకు తత్తరపాటు కలిగింది!

మెట్లమీద బూట్లచప్పుడు.

ఆమెకు ముచ్చెమటలు పట్టాయి.

"ఎవరు ఇంట్లో?" పెద్దగా కేక.

ఆమె పలకలేదు.

రవి మెల్లిగా లోనికి వచ్చాడు.

మసకవెలుగులో మంచంమీద ఒక స్త్రీ ఆకారం కనిపించిం దతనికి.

రవికి అంతా అయోమయంగా తయారయింది!

"ఎవరూ?" మరలా ప్రశ్నించాడు.

"నేనే."

"వసూ!"

"ఊఁ . . ." అంది ఆమె.

"ఏమిటీ చీకట్లో? నేను వస్తున్నాననే సంబరమైనా లేకుండా ఆ మౌనం ఏమిటి? ఏమిటిది, వసూ?" ఆత్రంగా అడిగాడు.

ఆమె ఏడ్చింది!

రవికి ఆశ్చర్యం కలిగింది.

"వసూ! ఏడుస్తున్నావా? కారణం ఏమిటి?" అర్థం










కాని అతను లైటు వెలిగించాడు.

ఆ వెలుగులో ముడుచుకుపోయిన కమల కన్నీటి బిందువులు మెరిశాయి. ఆమె కమల అని గుర్తించిన రవికి ఒక్కసారి ఆశ్చర్యం వేసింది. కాస్సేపు అలాగే చూస్తూ ఉండిపోయాడు. కమల భోరుమని ఏడ్చింది!

రవి స్తంభించిపోయాడు!

తనకు స్వాగతం ఈ విధంగా ఉంటుందని తలచ లేదు! వసు ప్రేమదృక్కులతో, కమల కొంటె చేష్టలతో, అత్తమామల ఆదరణతో, ఇరుగు పొరుగు అభిమానంతో తన మెడని ఒక పూలహారం మెరుస్తుందని దారిలో వేయి కలలు కంటూ వచ్చాడు.

తనకు స్టేషనులోనే ఏదో భయంవేసింది! ఎవరూ రానందుకు ఎంతగానో విచారం చెందాడు. అయినా అంతగా పట్టించుకోలేదు! వసుతో తానెలా సంభాషణ కొనసాగించాలా అన్నదే తనకు అప్పటి ప్రధాన సమస్య!

కానీ ఏమిటిది?

ఇంట్లో ఎవ్వరూ లేరు! ఒక్క కమల మాత్రం ఏడుస్తూ కూర్చుంది! అతను నిలువెల్లా కంపించి పోయాడు!

"ఏం జరిగింది, కమలా?" అతని కంఠం జీర పోయింది.

"అక్క మనలను అన్యాయం చేసింది, బావా?" కమల చేతుల్లో ముఖం దాచుకుంది.

రవి మీద పిడుగు పడింది!

"నేను ఇండియాకు రాలేదు! పోవాలనుకుంటున్న నేను లండనులోనే ఉండి ఒక పీడ కలని కంటున్నాను! నా వసు నన్ను అన్యాయం చేయదు! అబద్ధం"—రవి పెద్దగా అరిచాడు!

వెంటనే "కమలా! నిజం చెప్పు! ఇది కల కాదూ? !" అని అమాయికంగా అడిగాడు.

కమల మాట్లాడలేదు! బిగ్గరగా ఏడ్చింది!

"ఎన్నాళ్ళయింది, కమలా!" అతను పూర్తిగా జారి పోయినవాడిలా అడిగాడు.

"ఆరు నెలలయింది, బావా!"

"ఓహ్! ఇది నిజంగా కలే! ఇరవై రోజుల క్రితం వరకూ నా వసునుండి నాకు ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి! చనిపోయి ఆరు నెల లెలా అవుతుంది? చెప్పు, కమలా, చెప్పు! నాకు నిజంగా పిచ్చెత్తిపోతూంది!"

కమల మరింత పెద్దగా ఏడ్చింది!

"ఆ ఉత్తరాలు అక్కపేరిట నేనే వ్రాశాను, బావా!"

"నా కెందుకు తెలియజేయలేదు!"

"పూర్తి కావస్తున్న నీ చదువుకు చివరికాలంలో ఈ భరించరాని విషయం చెప్పి బాధించటం ఇష్టంలేక అమ్మ, నాన్నల ప్రోత్సాహంతో నేనే ఈ పని చేశాను. నన్ను క్షమించు, బావా!"

"కమలా! నిన్ను నేను క్షమించినా వసు మనలని క్షమించదు! ఆమెది ఒక దౌర్భాగ్యమైన చావుగా తయారుచేసింది మీరు! పరితపిస్తున్న ఆమెకు భర్త సాన్నిధ్యాన్ని దూరంచేశారు! కనీసం ఆత్మలో ఆత్మనైన నా అశ్రుతర్పణాన్ని కూడా ఆమెకు దక్కనీకుండా చేశారు! ఈ పాపం మీది, కమలా, మీది!" అంటూ ఎదురుగా లైటు వెలుగులో కనిపించే వసు ఫొటోకేసి నడిచాడు రవి.

ఆమెకు ఆకస్మికంగా వచ్చిన విషజ్వరం ఆమె ప్రాణాల్ని సయితం తీసిందని తరవాత కమల చెప్పగా ఎక్కిఎక్కి ఏడుస్తూ విన్నాడు రవి.

* * *

రెండేళ్ళు గడిచాయి! రవి తన సూట్‌కేసు దులుపుతూ అందులో ఒక ఉత్తరాన్ని చూశాడు! దానిని మరలా చదివాడు. తేదీ చూసినపుడు అతని కో విషయం గుర్తుకు వచ్చింది. అది వసుపేరుతో కమల వ్రాసిన ఉత్తరం!

కమల వ్రాసిన మాటల్లో అతని కానాడు ఒక ప్రత్యేకత కనిపించింది!

"నేనొక కమలాన్ని! రవి కిరణంకోసం ఎదురుచూసే కమలాన్ని . . ."

అతనికి ముచ్చెమటలు పట్టాయి!

వెంటనే రెండు మూడు రోజుల క్రితం కమల నుండి వచ్చిన ఉత్తరాన్ని తీసి చదివాడు!

"బావా!

అమ్మ, నాన్న నాకు పెళ్ళిచేయాలంటున్నారు! వారికి నా పెళ్లి చేయటం ఒక్కటే తెలుసు. ఈ విషయంలో నీవు నా మంచి చెడ్డల్ని ఆలోచిస్తావని గంపెడాశ పడ్డాను.

అక్కను గురించి విచారించటం నేను తప్పనటం లేదు!

కానీ బ్రతికి ఉన్న మా మంచిచెడ్డల్ని మరిచి మరణించిన అక్కకోసం అంతగా విచారిస్తావని నే నెన్నడూ అనుకోలేదు!

పై మాటలు సాహసంచేసి వ్రాసినందుకు క్షమించు, బావా!

నన్నర్థంచేసుకుంటావనే ఆశతో,

నీ మరదలు,
—కమల."

ఉత్తరం చదివి కాస్సేపలా మౌనంగా ఉండిపోయాడు రవి.

'వివాహమే వద్దనుకుంటున్న తనను కమల ప్రేమిస్తూందా!'

రవికి అయోమయంగా తయారయ్యింది!

'కమల! తన అక్క ఆకస్మిక మరణం చెందిన నాడు ఆమె చనిపోయిన అక్కను గురించి కాదు ఆలోచించింది! బ్రతికి ఉన్న తనను గురించి! తానెక్కడ ఆవేదనతో కుంగిపోతానో అనుకొని తన అక్కపేరుతో అబద్ధం ఉత్తరాలు వ్రాసింది!

తనను ప్రియమైన భర్తగారని సంబోధించింది! ఆమె రవి కిరణంకోసం ఎదురుచూసిన కమలం. కమలాన్ని నిర్లక్ష్యంచేసి వెళ్లిపోయిన రవి తాను. ఆమె బ్రతికి ఉన్న తనను గురించి ఆవేదనపడింది! తాను చనిపోయిన వసుకోసం యోచిస్తూ ఇన్నాళ్లూ కూర్చుండిపోయాడు!'

అతని మనః పథంలో ఒక ఆలోచన తులుక్కుమంది!

'వసు చావలేదు!

ఆమె ఆత్మ కమల నావేశించి ఆమె చేత ఆ ఉత్తరాల్ని తన పేర వ్రాయించింది!

వసు కమలలో ఉంది!

నా కిరణం సోకే కమలం కావాలి.' అతను పెద్దగా అనుకున్నాడు.

వెంటనే సూట్‌కేసు సర్దుకొని రైల్వేస్టేషనుకు పరుగెట్టుకు వెళ్లాడు! ★